క్లుప్తంగా

వైఎస్సార్‌సీపీ నాయకుడికి పరామర్శ



కురుబ గిరిబాబును పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి

విడపనకల్లు: విడపనకల్లు వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ నాయకులు కురుబ గిరిబాబును మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి శనివారం పరామర్శించారు. మూడు రోజుల క్రితం కురుబ గిరిబాబు అనారోగ్యంతో అనంపురంలోని సన్‌రే హాస్పిటల్లో చికిత్స కోసం చేరాడు. విషయం తెలుసుకున్న విశ్వేశ్వరరెడ్డి హాస్పిటల్‌కు వెళ్లి ఆయన్ను పరామర్శించారు. గిరిబాబు ఆరోగ్య పరిస్థితిపై వైద్యులతో అడిగి తెలుసుకున్నారు. విశ్వేశ్వరరెడ్డితో పాటు స్థానిక మండల నాయకులు ఎస్సీసెల్ నాయకులు సుంకన్న, బెస్త ఎర్రిస్వామి,దేశాయ్ సోమనాథ్, మాజీ సర్పంచు దేశాయ్ చంద్రనాథ్, యువరాజు, ఉలిగన్న, నాగరాజు ఉన్నారు.

20న జాబ్‌మేళా

రాయదుర్గంటౌన్: పట్టణంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఈ నెల 20న జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఎం.శ్రీనివాసులు తెలిపారు. కియా అనుబంధ సంస్థ అయిన సియాన్ ఆధ్వర్యంలో జరిగే మెగా జాబ్‌మేళాలో జిల్లాలోని నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నట్లు తెలిపారు. డిప్లమో, బీటెక్, డిగ్రీలో ఏదైనా పూర్తి చేసినా వారు సంబంధిత సర్టిఫికెట్లతో ఉదయం 9 గంటలకు హాజరుకావాలని తెలిపారు.

రాయదుర్గంలో భారీ వర్షం



వర్షంతో ముంపునకు గురైన కొలిమివీధి

రాయదుర్గంటౌన్:పట్టణంలో శనివారం మధ్యాహ్నం 3 గంటల నుంచి గంటన్నరపాటు భారీ వర్షం కురిసింది. దీంతో పట్టణంలోని లోతట్టు కాలనీల్లోని రోడ్లపై వర్షపునీరు ముంచెత్తింది. వర్షం కారణంగా కొలిమివీధి, రామస్వామి వీధి, మీ సేవా ఏరియా, కేబీ ప్యాలెస్ రోడ్డు సర్కిల్‌లో వర్షపునీరు పారింది. ముఖ్యంగా కొండ ప్రాంతం నుంచి ప్రధాన కాలవలో భారీ స్థాయిలో నీరు రావడంతో లోతట్టు కాలనీల్లో డ్రైనేజీలు పొంగిపొర్లాయి.

జనార్దన వేంకటేశ్వరస్వామికి పూజలు



అలంకరణలో జనార్దన వేంకటేశ్వరస్వామి

వజ్రకరూరు: స్థానిక జనార్దన వేంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం స్వామికి విశేష పూజలు చేశారు. ఆలయంలో స్వామికి ప్రత్యేక పూజలతోపాటు అభిషేకాలు, అర్చనలు, మహా మంగళహారతి, తీర్థ ప్రసాదాల వినియోగం నిర్వహించారు.


ఎర్రగుంటలో గ్రామీణ క్రికెట్ టోర్నీ

కుందుర్పి: మండలంలోని ఎర్రగుంట గ్రామంలో ఈ నెల 20 నుంచి గ్రామీణ క్రికెట్ టోర్నీ నిర్వహించనున్నట్లు యూత్ అసోసియేషన్ సభ్యులు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. టోర్నీలో విజేత జట్టుకు రూ. 22,000, రన్నర్స్ జట్టుకు రూ.11,000 నగదుతో పాటు ట్రోఫీ అందిస్తామని నిర్వాహకులు తెలిపారు.

తహసీల్దార్‌పై చర్యలు తీసుకోవాలి

రాయదుర్గం రూరల్: వీఆర్‌ఏతో కారు శుభ్రం చేయించిన తహసీల్దార్‌పై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి మల్లికార్జున డిమాండ్ చేశారు. శనివారం ×సాక్షి×లో ×అయ్యా ... ఇదేం చాకిరి× శీర్షికన వార్త ప్రచురితమైంది. ఇంటి పనులు చేయించిన తహసీల్దార్‌పై చర్యలు తీసుకోవాలని గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం నాయకులు కోరారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు



కౌన్సెలింగ్ ఇస్తున్న తహసీల్దార్ హరినాథరావు, ఎస్‌ఐ శివ

బెళుగుప్ప: ఎన్నికల నియమావళి అమలులో ఉన్న అన్ని రోజులు గ్రామాల్లో అల్లర్లకు పాల్పడితే చర్యలు తప్పవని తహసీల్దార్, మండల మెజిస్ట్రేట్ హరినాథ్‌రావ్, ఎస్‌ఐ శివ హెచ్చరించారు. శనివారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఇదివరకు కేసుల్లో ఉన్న రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇచ్చారు. అనంతరం వారు మాట్లాడుతూ గ్రామాల్లో ప్రశాంత జీవనం సాగించాలన్నారు. అల్లర్లకు పాల్పడినా, ఘర్షణలకు ప్రేరేపించినా చర్యలు తప్పవని హెచ్చరించారు.

రైతు మోము మురిసెన్

- ఖరీఫ్ ఆరంభంలోనే అందిన పెట్టుబడి రాయితీ
- రైతులకు రూ.126.19 కోట్ల ఇన్‌పుట్ సబ్సిడీ
- 81,919 మంది ఖాతాలకు ప్రభుత్వం జమ
- మిచాంగ్ తుపాను, గతేడాది కరువుతో దెబ్బతిన్న పంటలు



వర్షాభావ పరిస్థితులతో ఎండిపోయిన వేరుశనగ పంట (ఫైల్)

పెట్టు రాయితీ సొమ్ము వివరాలిలా..

మండలం	రైతులు	జమ అయిన నగదు కోట్లలో..
డీ హీరేహాళ్	6,370	రూ.9.02
రాయదుర్గం	10,168	రూ.18.15
గుమ్మఘట్ట	6,504	రూ.13.22
కణేకల్లు	5,264	రూ.7.53
కళ్యాణదుర్గం	8,611	రూ.11.68
బ్రహ్మ సముద్రం	8,387	రూ.11.13
శెట్టూరు	4,693	రూ.రూ.7.5
కుందుర్పి	6,895	రూ.10.25
కంబదూరు	4,387	రూ.6.55
ఉరవకొండ	5,655	రూ.9.23
విడపనకల్లు	3,777	రూ.4.67
వజ్రకరూరు	11,208	రూ.17.26

రాయదుర్గం: అన్నివర్గాల సంక్షేమాన్ని కోరుకునే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి.. అన్నదాతలకు కష్టకాలంలో వెన్నుదన్నుగా నిలిచారు. గత 59 నెలల పాలన కాలంలో రైతుకు దక్కాల్సిన ప్రయోజనాలను ఎప్పటికప్పుడు అందిస్తూ, వారి సంక్షేమం, అభివృద్ధికి పెద్దపీట వేశారు. టీడీపీ హయాంలో పంట నష్టపోతే రైతులు మరింత కుంగిపోవాల్సి వచ్చేది. అధికారులు లెక్కలేసి పంపడం తప్పా, పరిహారం ఎప్పుడొస్తుందో చెప్పలేని పరిస్థితి. దీంతో రైతన్నలు కార్యాలయాల చుట్టూ తిరిగి వేసారిన సందర్భాలు కోకోల్లలు. 2023 ఖరీఫ్‌లో వాతావరణంలో చోటుచేసుకున్న మార్పులతో వరుణ దేవుడు ముసుగేశాడు. విపత్తు వచ్చి పంటలు నష్టపోయిన రైతులకు పెట్టుబడి రాయితీ (ఇన్‌పుట్ సబ్సిడీ) అందిస్తూ సీఎం జగన్ రైతు పక్షపాతిగా నిలిచారు. రాయదుర్గం, కళ్యాణదుర్గం, ఉరవకొండ నియోజకవర్గాల్లోని 2023 ఖరీఫ్‌లో నష్టపోయిన రైతులకు రాష్ట్ర ప్రభుత్వం శనివారం ఇన్‌పుట్ సబ్సిడీ జమచేసింది. మూడు నియోజకవర్గాల్లోని 81,919 మంది రైతులకు రూ.126.19 కోట్లు ఖాతాలకు చేర్చింది. ఖరీఫ్ సాగు ఆరంభంలో పెట్టుబడి రాయితీ సొమ్ము జమకావడం పట్ల ముంగారు రైతు మురిసిపోతున్నాడు.

అడ్డుకున్నా ఆగని పరిహారం

సాధారణంగా ఇన్‌పుట్ సబ్సిడీ నగదు ఎన్నికలకు ముందే జమ కావాల్సి ఉంది. టీడీపీ అధినేత చంద్రబాబు బృందం కుట్రపూరిత రాజకీయాలకు తెరలేపారు. తన అనుయాయులతో ఈసీకి ఫిర్యాదు చేయించి నగదు జమకానీకుండా అడ్డుపడ్డారు. దీంతో బాధిత రైతులు హైకోర్టును ఆశ్రయించారు. ఇన్‌పుట్ సబ్సిడీ చెల్లింపునకు ఆంక్షలు తొలగించాలని కోరారు. పోలింగ్ ప్రక్రియ ముగియడంతో డీబీటీ పథకాలకు ఈసీ ఆంక్షలు ఎత్తేసింది. దీంతో రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీని రాష్ట్ర ప్రభుత్వం జమ చేసింది.

ప్రతి రైతుకూ పరిహారం

అర్హత కలిగిన ప్రతి రైతుకూ రాష్ట్ర ప్రభుత్వం పెట్టుబడి రాయితీ అందించింది. ఆ వివరాలను స్థానిక ఆర్‌బీకేల్లో ప్రదర్శించారు. జాబితాలో పేరున్న ప్రతి రైతుకూ తప్పక పరిహారం అందుతుంది. బ్యాంకు సెలవు, ఇతర కారణాలు వెరసి ఒకటి రెండు రోజులు ఆలస్యమయినా రైతు ఖాతాకు పరిహారం జమ అవుతుంది.

పెట్టుబడికి ఢోకాలేదు



ఖరీఫ్ సీజన్ ఆరంభమైంది. పెట్టుబడి కోసం ప్రతి పైసా అవసరమొచ్చింది. ఇలాంటి పరిస్థితుల్లో రాయితీ సొమ్ము విడుదల కావడం సంతోషాన్నిచ్చింది. గతేడాది వర్షాలు కురువక నష్టపోయాం. పరిహారం ఇచ్చి ఆదుకుంటామని సీఎం జగన్ చెప్పారు. ఆయన మాటిస్తే తప్పే నైజం కాదు. కొందరి కుట్రల వల్ల ఆలస్యమైంది. అయినా రైతుకు న్యాయం జరిగింది.

– ముసలిరెడ్డి, రైతు, పూలకుంట

ఓటమి భయంతోనే అడ్డుకున్నారు



59 నెలల కాలంపాటు రాష్ట్ర ప్రభుత్వం డీబీటీ పథకాలు కొనసాగించింది. చంద్రబాబు లాగా ఓట్ల కోసం ఎన్నికలప్పుడే పథకాలు ప్రవేశపెట్టి, మభ్యపెట్టడం జగన్ నైజం కాదు. డీబీటీ కొనసాగితే భవిష్యత్తు ప్రశ్నార్థకమవుతుందనుకున్నారు. ఓటమి భయంతోనే ఈసీకి ఫిర్యాదు చేయించి, డీబీటీ పద్ధతిని అడ్డుకున్నారు. ఎన్నికల పూర్తయినా ఇచ్చిన మాటకు కట్టుబడి పంట నష్టపోయిన ప్రతి రైతుకూ సీఎం జగన్ దన్నుగా నిలిచారు. ఒక్క రాయదుర్గం నియోజకవర్గంలోనే 28,306 మంది రైతులకు రూ.47.92 కోట్లు జమ చేశారు. ఎవరికైనా జమకాకపోయి ఉంటే ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. అందరికీ న్యాయం జరిగేలా కృషి చేస్తాం.

– మెట్టు గోవిందరెడ్డి, ఎమ్మెల్యే అభ్యర్థి, రాయదుర్గం

కనుల పండువగా వీరబ్రహ్మేంద్రస్వామి రథోత్సవం



చోళసముద్రంలో అలంకరణలో వీరబ్రహ్మేంద్రస్వామి



చోళసముద్రంలో వీరబ్రహ్మేంద్ర స్వామి చిత్రపటాన్ని ఊరేగిస్తున్న దృశ్యం



బెళుగుప్పలో పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

బెళుగుప్ప: మండల కేంద్రంలోని విరుపాక్షేశ్వర స్వామి ఆశ్రమంలో వెలసిన పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి మఠం వద్ద శనివారం భక్తిశ్రద్ధలతో రథోత్సవాన్ని నిర్వహించారు. విరుపాక్షేశ్వరస్వామి ఆశ్రమ పీఠాధిపతులు ఈశ్వరస్వామి రథానికి తొలి పూజలు నిర్వహించి, రథం వద్ద శాంతిహోమాలు నిర్వహించారు. అనంతరం వీరబ్రహేంద్రస్వామి, గోవిందమ్మ అమ్మవారి ఉత్సవ విగ్రహాలకు ఏకవార రుద్రాభిషేకం చేశారు. రథంలో కొలువుదీర్చి రథోత్సవాన్ని ముందుకు సాగించారు. రథం స్థానిక బ్రహ్మంగారి మఠం నుంచి మెయిన్ బజారు మీదుగా శాంతిధామంలోని సద్గురు ఎర్రితాత, శ్రీనాగిరెడ్డి తాత ఆలయాల వరకు వెళ్లి తిరిగి బ్రహ్మంగారి ఆలయం వరకు రథాన్ని తీసుకువచ్చారు. రథోత్సవంలో చుట్టు ప్రక్కల ప్రాంతాల నుండి ఎక్కువ సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు. స్థానిక ఎస్‌ఐ శివ నేతృత్వంలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

కూడేరు: మండలంలోని చోళసముద్రంలో పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి ఆరాధనోత్సవాన్ని గ్రామస్తులు శనివారం ఘనంగా జరుపుకున్నారు. తొలుత వీరబ్రహ్మేంద్ర స్వామి చిత్రపటాన్ని గ్రామ పురవీధుల్లో ఊరేగించారు.

వజ్రకరూరు: మండలంలోని గూళ్యపాళ్యం గ్రామంలో శనివారం సాయంత్రం పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి చిత్రపటాన్ని ఊరేగించారు. స్వామి ఆరాధన ఉత్సవాల్లో భాగంగా ఉదయం ఆలయంలో స్వామికి ప్రత్యేక పూజలు, ఆకుపూజ, పంచామృతాభిషేకాలు, మహా మంగళహారతి, తీర్థ ప్రసాద వినియోగం నిర్వహించారు. అనంతరం అన్నదానం నిర్వహించారు.



ప్రత్యేక అలంకరణలో పోతులూరి వీరబ్రహ్మం

సబ్సిడీ విత్తన వేరుశనగ కోసం రిజిస్ట్రేషన్



చీకలగురికిలో విత్తన వేరుశనగకు రిజిస్ట్రేషన్ చేసుకుంటున్న రైతులు

విడపనకల్లు: సబ్సిడీ విత్తన వేరుశనగ కోసం రైతులు ఆర్‌బీకేల్లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ఏఓ పెన్నయ్య తెలిపారు. శనివారం మండలంలోని పాల్తూరు, చీకలగురికి, పొలికి, ఉండబండ తదితర గ్రామాల్లో ఆర్‌బీకేల వద్ద రైతులు రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. సబ్సిడీతో పచ్చి రొట్ట ఎరువులు, పిల్లి పెసర, తదితర రకాల విత్తనాలను కూడా సబ్సిడీతో ఇస్తున్నట్లు ఏఓ తెలిపారు.

బొమ్మనహాళ్: ప్రభుత్వం అందించే సబ్సిడీ విత్తన వేరుశనగ కోసం ఆర్‌బీకేల్లో రైతులు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని ఏఓ సాయికుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. సబ్సిడీ విత్తనాలు కావాల్సిన రైతులు పట్టాదారు పాస్ పుస్తకం, ఆధార్‌కార్డు, మొబైల్ నంబర్, నగదుతో సమీప రైతు భరోసా కేంద్రాలల్లో సంప్రదించాలన్నారు.

అద్భుతమైన చరిత్ర 'అనంత' సొంతం

అనంతపురం కల్చరల్: జిల్లాలోని చారిత్రాత్మక వారసత్వ సంపదను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని పురావస్తు శాఖ ఏడీ రజిత అన్నారు. శనివారం స్థానిక ఆదిమూర్తి నగర్‌లోని పద్మశ్రీ కల్లూరు సుబ్బారావు పురావస్తుశాఖ కార్యాలయంలో మ్యూజియం దినోత్సవం జరుపుకున్నారు. విద్యార్థులు అధిక సంఖ్యలో తరలి వచ్చి మ్యూజియంలోని వస్తువులను తిలకించారు. ఏడీ రజిత విద్యార్థులకు అనంత చరిత్ర పరిణామాన్ని, వివిధ కాలాలలోని చారిత్రక విషయాలను వివరించారు. చరిత్ర అధ్యయనం ఉత్తమ భవిష్యత్తుకు మార్గదర్శనం చేస్తుందన్నారు. ఆత్మీయ అతిథిగా విచ్చేసిన గ్రంథాలయ సంస్థ కార్యదర్శి రమ మాట్లాడుతూ.. జిల్లా కేంద్రంలో అద్భుతమైన మ్యూజియం నిర్మాణమై మన ముంగిటకు రావడం అందరూ గర్వించాల్సిన విషయమన్నారు. అనంతరం అతిథులు, రచయితలను మ్యూజియం సిబ్బంది సత్కరించారు. కార్యక్రమంలో పురావస్తు శాఖ సాంకేతిక సహాయకుడు మహేంద్రనాయుడు, గిరిధరరాయ్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పురావస్తు శాఖ ఏడీ రజిత

ఇసుక తరలింపును అడ్డుకున్న గ్రామస్తులు

కణేకల్లు: మండలంలోని రచ్చుమర్రిలో అనమతి లేకుండా ప్రతిమ ఇన్ఫ్రాస్ట్రక్చర్ కంపెనీ ఇసుక తరలిస్తుండటంతో గ్రామస్తులు, పోలీసులు, రెవెన్యూ అధికారులు అడ్డుకున్నారు. ఓ కంపెనీ పది నెలల క్రితం తమకు ఇసుక తరలింపునకు అనుమతి ఉందని రచ్చుమర్రి ఇసుక రీచ్‌లో ఇసుక తవ్వకాలు చేసి, టన్నుల కొద్దీ ఇసుక నిల్వ ఉంచింది. అప్పట్లో మైనింగ్ అధికారులు సీజ్ చేశారు. రాయదుర్గం మండలం జుంజరంపల్లిలో ఇసుక తవ్వకాల లీజ్ పొందిన ప్రతిమ ఇన్ఫ్రాస్ట్రక్చర్ కంపెనీ శనివారం రచ్చుమర్రి ఇసుకరీచ్‌లో అడుగుపెట్టింది. తమకు జిల్లా అధికారుల నుంచి అనుమతి ఉందని అప్పట్లో సీజ్ చేసిన ఇసుక విక్రయానికి యత్నించింది. జుంజరంపల్లి ఇసుక రీచ్‌లో ఇసుక కోసం వచ్చిన టిప్పర్లు, ట్రాక్టర్లను రచ్చుమర్రికి మళ్లించింది. ఈ విషయం తెలుసుకున్న గ్రామస్తులు, పోలీసులు, రెవెన్యూ అధికారులు ఇసుక రీచ్ వద్దకెళ్లారు. అప్పటికే ఒక టిప్పర్, రెండు ట్రాక్టర్లలో ఇసుక తరలించారు. అక్కడున్న కంపెనీ సిబ్బందిని పోలీసు, రెవెన్యూ అధికారులు ఇసుక తరలింపునకు అనుమతి ఉందా? అని ప్రశ్నించగా, జిల్లాలో ఉన్న తమ ప్రతినిధులతో ఫోన్‌లో మాట్లాడించారు. కాగా ఇసుక తరలింపునకు ఎలాంటి ఉత్తర్వులు లేకపోవడంతో అధికారులు ఇసుక తరలింపు చేయొద్దని సూచించారు. దీంతో సిబ్బంది అక్కడికొచ్చిన పలు ట్రాక్టర్లను వెనక్కి పంపారు.



ఇసుక తరలింపును అడ్డుకుంటున్న గ్రామస్తులు, పోలీసులు

వైభవంగా వాసవీమాత జయంత్యుత్సవం



వాసవీమాత విగ్రహాన్ని ఊరేగిస్తున్న మహిళలు



వాసవీమాత కలశాలను ఊరేగిస్తున్న ఆర్యవైశ్య మహిళలు

రాయదుర్గంటౌన్: పట్టణంలోని కోటలో వెలసిన వాసవీ కన్యకాపరమేశ్వరిదేవి ఆలయంలో వాసవీమాత జయంత్యుత్సవం శనివారం నిర్వహించారు. పట్టణంలోని ఆర్యవైశ్యులు వ్యాపార, వాణిజ్య దుకాణాలు బంద్ చేసి, ఉత్సవాల్లో పాల్గొన్నారు. ఉదయం 7 గంటలకు ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు సురేష్‌కుమార్, సభ్యులతో పతాక ఆవిష్కరణ చేసి, అమ్మవారికి పంచామృతాభిషేకం, పుష్పార్చన, కుంకుమార్చన, సహస్రనామార్చన చేశారు. ఉదయం 9 గంటలకు వినాయక సర్కిల్‌లోని బసవన్న ఆలయం వద్ద నుంచి వాసవీమాత ఆలయం వరకు వాసవీమాత కళశాలను మహిళలు ఊరేగించారు. సాయంత్రం అమ్మవారిని విద్యుద్దీపాలంకరణ, మేళతాళాలతో పుర వీధుల్లో ఊరేగించారు.

కణేకల్లులో ఘనంగా వాసవీ జయంతి

కణేకల్లు: మండల కేంద్రంలో వాసవీజయంతి వేడుకలు శనివారం ఘనంగా జరిగాయి. కన్యాకపరమేశ్వరి ఆలయంలో వాసవీమాతను ప్రత్యేకంగా అలంకరించి, పూజలు చేశారు. కుంకుమార్చన, మంగళారతి, పంచామృతాభిషేకం తదితర పూజలు చేశారు.

బొమ్మనహాళ్: మండలంలోని దర్గాహొన్నూరులో వాసవీమాత జయంతి వేడుకలను శనివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వాసవీమాత విగ్రహాన్ని శోభాయమానంగా అలంకరించారు. అమ్మవారికి అభిషేకం, కుంకుమార్చన, ప్రత్యేక అలంకరణ పూజలు చేశారు. అనంతరం గ్రామ వీధుల్లో వాసవీమాత విగ్రహాన్ని ఊరేగించారు. భక్తులకు అన్నదానం నిర్వహించారు.



ప్రత్యేక అలంకరణలో వాసవీమాత



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

నేడు స్వర నీరాజనం

అనంతపురం కల్చరల్: తొలిసారిగా అనంతలో 8 సాంస్కృతిక సంస్థలు స్వర నీరాజనం పేరుతో ఘంటసాలకు నివాళులర్పించనున్నారు. ఎల్‌కేపీలో ఆదివారం ఉదయం 9 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు స్వర నీరాజనం కొనసాగనుంది. 'ఘంటసాల ది గ్రేట్' బయోపిక్‌ను నిర్మిస్తున్న సినీ నిర్మాత, దర్శకులు సీహెచ్ రామారావు శనివారం అనంతకు విచ్చేశారు. నిర్వాహకులు అనంత ఘంటసాల రామయ్య, గాయకుడు పాలసముద్రం నాగరాజు, కన్వీనర్ బాలమురళీకృష్ణ, ఓబుళదాసు, దర్శక నిర్మాత రామారావు మాట్లాడారు.

టీడీపీలో ఓటమి గుబులు

కళ్యాణదుర్గం: కళ్యాణదుర్గం టీడీపీ నేతలకు ఓటమి గుబులు పట్టుకుంది. ఎన్నికల కోసం రూ.కోట్లు ఖర్చు చేసినా, ఈ సారి ఎన్నికల్లో గెలిచే అవకాశాలు కనిపించలేదని ఆ పార్టీ నేతలు అంతర్మథనంలో పడ్డారు. ఇదిలా ఉండగా, ఎన్నికల పోలింగ్ ఈనెల 13న పూర్తి కాగానే 14న టీడీపీ అభ్యర్థి అమిలినేని సురేంద్రబాబు పోలింగ్ ఏజెంట్లు, ముఖ్య నాయకులకు విందు ఏర్పాటు చేశారు. బూత్‌ల వారీగా పోలింగ్ సరళిపై అందరితో చర్చించారు. కళ్యాణదుర్గం మున్సిపాలిటీలో కొన్ని వార్డులు, కళ్యాణదుర్గం రూరల్ మండలాల్లో కొన్ని గ్రామాలతో పాటు బ్రహ్మసముద్రం మండలంలో కేవలం నాలుగు గ్రామాలు మాత్రమే టీడీపీకి అధికంగా ఓట్లు వేశారని తేల్చినట్లు తెలుస్తోంది. దీంతో అసంతృప్తి చెందిన అభ్యర్థి..ఆయా మండలాల నాయకుల తీరుపై అసహనం వ్యక్తం చేశారని సమాచారం. అమిలినేనిపై అసంతృప్తితో ఉన్న నాయకులపై అధిష్టానానికి ఫిర్యాదు చేసేందుకు కొందరు ముఖ్య నాయకులతో కలిసి శుక్రవారం రాత్రి విజయవాడకు వెళ్లారు.

ఆస్పత్రిలో చికిత్స పొందుతూ యువకుడి మృతి

బొమ్మనహాళ్: కృష్ణాపురానికి చెందిన కావలి అర్జున్ (34) బళ్లారి విమ్స్‌లో చికిత్స పొందుతూ శనివారం మృతి చెందిన్నట్లు బొమ్మనహాళ్ హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాసులు తెలిపారు. భార్య పుట్టినింటికి వెళ్లిందని అర్జున్ ఈనెల 10న ఇంట్లో పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. కుటుంబ సభ్యులు బళ్లారి విమ్స్‌కు తరలించగా, అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందిన్నట్లు తెలిపారు. మృతుడు తండ్రి పెన్నయ్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేశారు. మృతుడికి భార్య విజయమ్మ, ఇద్దరు కుమారులు ఉన్నారు.

గిరిజన గురుకులాల్లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

కళ్యాణదుర్గం: పట్టణంలోని గిరిజన గురుకుల పాఠశాల (బాలురు)లో 2024–25 విద్యా సంవత్సరానికి మూడో తరగతిలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ నాగరాజు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు ఈనెల 20 లోపు గిరిజన గురుకుల పాఠశాలలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. 3వ తరగతిలో 40 సీట్లు ఉన్నాయని, ఎస్టీలకు 30, ఎస్సీలకు 5, బీసీలకు 2, ఓసీలకు 1 ఉన్నాయన్నారు. బ్యాక్‌లాగ్ సీట్లు 4వ తరగతిలో 37, 5వ తరగతిలో 37, 6వ తరగతిలో 26, ఏడో తరగతిలో 7, ఎనిమిదో తరగతిలో 4, తొమ్మిదో తరగతిలో 9 సీట్లు ఖాళీగా ఉన్నాయన్నారు. పూర్తి వివరాలకు 9963205664, 6302846353 నంబర్లలో సంప్రదించాలన్నారు.

రాగులపాడు పాఠశాలలో..

వజ్రకరూరు: మండలంలోని రాగులపాడు ఏపీ గిరిజనబాలుర గురుకుల పాఠశాలలో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ చంద్రశేఖర్ బాబు శనివారం ఓ ప్రకటనలో కోరారు. మూడో తరగతిలో ఎస్టీ–32, ఎస్సీ 5, బీసీ 2, ఓసీ 1 సీట్లు ఖాళీగా ఉన్నట్లు తెలిపారు. నాల్గో తరగతిలో ఎస్టీ 40 సీట్లు, 5వ తరగతిలో ఎస్టీ 37 సీట్లు, 6వ తరగతిలో ఎస్టీ 30 సీట్లు, 7వ తరగతిలో ఎస్టీ 12 సీట్లు, 8వ తరగతిలో ఎస్టీ 12 సీట్లు, 9వ తరగతిలో ఎస్టీ 19 సీట్లు ఖాళీ ఉన్నట్లు తెలిపారు. ఈనెల 20లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

ఇంటర్మీడియెట్‌లో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోండి

బ్రహ్మసముద్రం: ఇంటర్మీడియెట్‌లో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవాలని జెడ్పీ ఉన్నత పాఠశాల, జూనియర్ కాలేజ్ ప్రిన్సిపాల్ చాగంటి చంద్రమౌళి తెలిపారు. ఇది వరకు మండలంలో పదోతరగతి వరకు మాత్రమే ఉండేది. ప్రస్తుత విద్యాసంవత్సరం నుంచి ఇంటర్‌మీడియెట్ ప్రవేశపెట్టారు. ఈ ఏడాది ఎంపీసీ , సీఈసీ గ్రూపులు అందుబాటులో ఉన్నాయని, ఒక్కో గ్రూప్‌లో 40 మంది విద్యార్థులకు ప్రవేశం కల్పించనున్నట్లు ప్రిన్సిపాల్ తెలిపారు.

విలువైన స్థలం కబ్జాపై కలెక్టర్ ఆరా

సాక్షి ఎఫెక్ట్..

రాయదుర్గం: పట్టణంలోని శాంతినగర్‌లో వైఎస్సార్ విగ్రహం వెనకభాగంలో ఉన్న 'రూ.కోటి విలువైన స్థలం పై కన్ను' శీర్షికన శనివారం 'సాక్షి' లో ప్రచురితమైంది. దీనికి జిల్లా కలెక్టర్ స్పందించారు. కబ్జా వివరాలను కళ్యాణదుర్గం ఆర్డీఓ రాణిసుస్మితతో ఆరా తీసినట్లు తెలిసింది. కలెక్టర్ ఆదేశాల మేరకు ఆర్డీఓ స్థానిక తహసీల్దార్ చిట్టిబాబు ఫోన్‌చేసి వివరాలు అడిగి తెలుసుకున్నారు. నివేదిక పంపాలని ఆదేశించారు. ప్రభుత్వ స్థలాలు ఆక్రమణకు గురి కాకుండా కాపాడాలని ఆదేశించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషన్ కిశోర్‌తో తహసీల్దార్ వివరాలు అడిగి తెప్పించారు.

శనీశ్వరస్వామికి ప్రత్యేక పూజలు



పూజలందుకున్న శనీశ్వరస్వామి

రాయదుర్గంటౌన్: పట్టణంలోని కణేకల్లు రోడ్డు భగత్‌సింగ్ కాలనీలో వెలసిన శనీశ్వర స్వామికి శనివారం ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. అర్చకులు ప్రత్యేక పూజలు చేసి తీర్థప్రసాదాలు అందించారు.

అంజన్నకు అభిషేకం

బొమ్మనహాళ్: ప్రసిద్ధి చెందిన నేమకల్లు అంజన్నకు శనివారం అభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి మూలవిరాట్‌ను పట్టువస్త్రాలు, పుష్పాలతో శోభాయమానంగా అలకరించారు. ఆలయ ప్రధాన అర్చకులు అనిల్ కుమార్‌స్వామి ఆధ్వర్యంలో పురోహితులు వేకువజాము నుంచే స్వామివారికి కుంకుమార్చన, పంచామృతాభిషేకం, ఆకుపూజ చేశారు.

నిముషాంబా దేవికి పూజలు

అనంతపురం కల్చరల్: భక్తుల కొంగు బంగారంగా భాసిల్లుతున్న నిముషాంబా దేవి జయంతి శనివారం నేత్రపర్వంగా సాగింది. స్థానిక చెరువుకట్టపై వెలసిన అమ్మవారి ఆలయంలో ఉదయం అమ్మవారిని వివిధ ఫలాలు, పుష్పాలతో అలంకరించారు. ఆలయంలో గణపతి, నవగ్రహ పూజలు, చండీ హోమాలను రుత్వికులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. మధ్యాహ్నం పూర్ణాహుతి, అన్నప్రసాద వితరణ జరిగాయి. సాయంత్రం అమ్మవారిని పూలరథంపై కొలువుదీర్చి పురవీధుల్లో ఊరేగించారు. తాడేపల్లిగూడెం నుంచి విచ్చేసిన శ్రీకాళీమాత డ్యాన్స్ బృందాలు చేసిన విన్యాసాలు ఆకట్టుకున్నాయి.